క్లుప్తంగా

గుడార అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీ పూజలు



అమ్మవారిని దర్శించుకొంటున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: మండలంలోని పిట్టు కోటిరెడ్డిపాలెం గ్రామంలో చీరాల వారి ఇలవేల్పు శ్రీ గుడార అంకమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ముఖ్య అతిథిగా శుక్రవారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు గ్రామ పెద్దలతో కలసి ఎంపీ మోపిదేవికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. యాగశాలలో ప్రత్యేక హోమగుండం వద్ద పూజలు జరిపించారు. అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ.. కమిటీ సభ్యులను అభినందించారు. ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, నాయకులు చీరాల ప్రసాద్‌రెడ్డి, చీరాల శివరామకృష్ణారెడ్డి చీరాల చెంచుదేవి, చీరాల వెంకటేశ్వరరెడ్డి, కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, పిట్టు కిరణ్‌కుమార్‌రెడ్డి, తూము కోటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఏబీఆర్ కళాశాల విద్యార్థి

రేపల్లె: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిచంద్ర పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రేపల్లె బ్రాంచి ఆధ్వర్యంలో పట్టణంలోని కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రమాదాలు, కాన్పుల సమయంలో గర్భిణులకు రక్తం అత్యవసరమన్నారు. శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని నల్లూరు, రుద్రవరం, పెనుమూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ



ప్యాపర్రు(వేమూరు): వృద్ధులకు ఉచితంగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల అధ్వర్యంలో కళ్లజోళ్లు అందించినట్లు మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో శుక్రవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న వృద్ధులకు కళ్లజోళ్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొరటా లీలా సత్యసాయి, సజ్జ శ్రీరామమూర్తి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొల్లూరు : ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కోటిపల్లిలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు అతని మృతదేహాన్ని వెలికితీశారు. ఏఎస్ఐ రామయ్య వివరాల మేరకు.. కోటిపల్లి కొత్త సంఘానికి చెందిన కాలం బుచ్చిబాబు ఉరఫ్ వెంకటప్పయ్య (38) ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు తన తల్లికి చెప్పి.. తిరిగి రాలేదు. మతిస్థిమితం అంతంతమాత్రంగా ఉన్న అతను పుట్టింటికి వెళ్లిన తన భార్య వద్దకు వెళ్లి ఉండవచ్చునని బంధువులు భావించారు. ఈ నేపథ్యంలో ఉదయం స్థానిక చెరువులో ఒక మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీచి పరిశీలించగా, కనిపించకుండా పోయిన బుచ్చిబాబుగా గుర్తించారు. మృతుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి, ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చునన్న అనుమానం వ్యక్తమవుతోంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంక్షేమ పథకాలే మహిళాభివృద్ధికి బాటలు

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి నాగార్జున

ఇంటూరు(వేమూరు): సంక్షేమ పథకాల వల్ల ప్రతి మహిళ అభివృద్ధి బాటలో నడుస్తుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం రెండో రోజు నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని కుటుంబాలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం మహిళలను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ప్రజలందరూ.. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, సర్పంచ్ మొద్దు జీవమణి, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టరు ఓలేటి శివాజీ, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ గుమ్మడి రవి రాజ్, ఎంపీటీసీలు తుమ్మ వెంకటరెడ్డి, ఆనందకుమారి, మాజీ సర్పంచ్ బట్టు మోహే, కమ్మ శామ్యూల్, సొసైటీ అధ్యక్షులు కాజా శంకర్ రెడ్డి, దంతు కృష్ణారెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, దుండి రాఘవ రెడ్డి, అవుతు ముత్తా రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం

- అల్లూరులో 'గడప గడపకు' కార్యక్రమానికి విశేష స్పందన
- స్థానికులకు నవరత్నాల కరత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి, ఎంపీటీసీలు వాలి కృష్ణవేణి, శివారెడ్డి, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, పార్టీ నాయకులు మండే విజయ్‌కుమార్, మంతెన గంగరాజు, ఎంపీపీ షేక్ బాజి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా.. లేదా అని తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, కొన్ని చోట్ల అంతర్గత రోడ్లు వేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. జలజీవన్ మిషన్ పథకం కింద అల్లూరు గ్రామానికి రూ.1.90కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, కో–ఆప్షన్ సభ్యులు కుంతం ప్రసన్నరాజ్ కుమార్, గోవతోటి విజయ్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, పార్టీ నాయకులు చేబ్రోలు వీరయ్య, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, యేట్ర అశ్వినిరెడ్డి, దబ్బకూటి మాధవ రావు, మునీర్, ఎంపీటీసీలు చల్లాపల్లి విజయ రాజు, కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, యేహోను, గుమ్మడి సీతయ్య, ఈఓపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శి శివ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు నాయకులు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కోనరఘుపతికి గ్రామస్తులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామ శివారులో పూలదండలు వేసి దుశ్శాలువాతో సత్కరించారు. రహదారి వెంట అడుగడుగునా పూలవర్షం కురిపించారు. గ్రామంలోని యువకులు బాణ సంచా కాలుస్తూ నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రైతులకు అందుబాటులో ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయ్‌బాబు

రేపల్లె: రబీ సీజన్‌లో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని మండల ఏఓ విజయ్‌బాబు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రబీలో సస్యరక్షణ, సాగు ప్రణాళిక, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ ఈ నెల 10వ తేదీలోపు రైతులు చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రబీకి అవసరమయ్యే ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వీఏఏలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

బాపట్లటౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు హెచ్చరించారు. అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక లారీను శుక్రవారం సెబ్ అధికారులు బాపట్లలోని మార్కెట్‌యార్డు సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక, మద్యం తరలిస్తే సహించేది లేదని సీఐ స్పష్టం చేశారు.



ఇసుక లారీను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

సీఎం వైఎస్ జగన్‌ది 'స్వచ్ఛ సంకల్పం'

ఎమ్మెల్యే కోన రఘుపతి



ఆలయ నిర్మాణానికి విరాళంగా లక్ష రూపాయల నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

కర్లపాలెం: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి స్పష్టం చేశారు. బాపట్ల డివిజన్ పరిధిలోని క్లాప్ మిత్రలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు జగనన్న స్వచ్ఛ సంకల్పంపై శిక్షణ ఇచ్చేందుకు మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామంలోని సంపద సృష్టి కేంద్రం వద్ద శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. శిక్షణ కేంద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని తొలుత ఆయన ఆవిష్కరించారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన క్లాప్ మిత్రలను సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఎమ్మెల్యే కోన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నిర్వహణలో జాతీయస్థాయిలో అవార్డు అందుకున్న దమ్మనవారిపాలెం గ్రామాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ సంకల్పంపై అధికారులకు ప్రజా ప్రతినిధులకు అవగాహన ఉన్నప్పుడే ప్రజలను చైతన్యవంతులను చేయగలుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురపసాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ జి.కమల, ఎంపీపీ యారం వనజ, ఇన్‌చార్జ్ డీపీఓ, డ్వామా పీడీ వై.శంకర్‌నాయక్, ఎంపీడీవో ఎ.ఎ లీషాబాబు, డీఎల్‌పీఓ పీడీఎస్ శరత్‌బాబు, డీఎల్‌డీఓ సీహెచ్ సువార్త, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

పిట్టలవానిపాలెం: అన్నంవారి ఇలవేల్పు సత్తెమ్మ తల్లి ఆశీస్సులు బాపట్ల నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు. మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో సత్తెమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం ఆయన భుమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దేవాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామ పెద్దలకు సూచించారు. ఏ అవసరం వచ్చినా తనవంతు సహాయం అందిస్తానని తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ దబ్బకూటి మాధవరావు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కోన రఘుపతి తనవంతు సాయంగా లక్ష రూపాయలు ప్రకటించి, నగదు చెక్కును గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కోన రఘుపతికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల సుబ్రహ్మణ్యంరెడ్డి, అన్నం కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు ఉన్నారు.

కాలువ ఆక్రమణలపై విచారణ



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీఈ ఉదయ భాస్కర్, ఏఈ శ్రీనివాసరావు

కర్లపాలెం: పంట కాలువపై ఆక్రమణలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ ఉదయభాస్కర్ తెలిపారు. నల్లమోతువారిపాలెం ఎత్తిపోతల కాలువ ఆక్రమణకు గురవుతుందని ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన ఆట్ల బాలాజీ రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డీఈ ఉదయ భాస్కర్, ఏఈ శ్రీనివాసరావు లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని పంట కాలువను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కేశవనారాయణరావును కలసి ఇరిగేషన్ కాలువ సర్వే నిర్వహించి, ఆక్రమణలు గుర్తించి, తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలను ఆక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కర్లపాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల సెబ్ సీఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. కర్లపాలేనికి చెందిన కాటూరి రాములు మద్యం సీసాలు అమ్ముతున్నాడని సమాచారం అందడంతో.. తమ సిబ్బందితో దాడిచేసి అతని వద్ద ఉన్న 9 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అతనిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని వెల్లడించారు.

విద్యుత్ చౌర్యం నేరం


తెనాలిటౌన్: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, అందుకు కఠిన చర్యలు తప్పవని ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి హెచ్చరించారు. తెనాలి రూరల్ మండల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది 68 బృందాలుగా ఏర్పడి గృహాల్లో విద్యుత్ చౌర్యం, అదనపు లోడు కేసులు తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం ఈఈ చిరంజీవి వివరాలు వెల్లడించారు. అదనపులోడు కేసులు 138 కాగా దీనికి అపరాధ రుసుం రూ.5,71,000లు, దొంగతం కేసులు మూడు కాగా రూ.1,80,000లు అపరాధ రుసుం విధించి, మరో కేసులో అపరాధ రుసుం రూ.5వేలు విధించినట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషించి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన హమారా ప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అసభ్యంగా దూషిస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై అందించిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తెలిపారు.

మహిళా పోలీస్ పాత్ర కీలకమైనది

సెబ్ ఏఈఎస్ నరసింహమూర్తి



మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ అధికారులు

బాపట్లటౌన్: మాదక ద్రవ్యాల నివారణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని సెబ్ ఏఈఎస్ నరసింహమూర్తి పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని మహిళా పోలీసులకు మాదక ద్రవ్యాల నివారణపై స్థానిక సెబ్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈఎస్ నరసింహమూర్తి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, నాటు సారా వల్ల కలిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేసినా, వాటిని వినియోగించినా.. కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా బాలకోటయ్య తిరునాళ్లు నిర్వహించాలి



తిరునాళ్ల నిర్వహణపై సమీక్షిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: అరవపల్లి బాలకోటయ్య తిరునాళ్ల వైభవంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు సూచించారు. మహా శివరాత్రి తిరునాళ్లపై బాలకోటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు త్వరితగతిన కల్పించాలన్నారు. పొంగళ్లు పెట్టుకునేందుకు, తల నీలాలు సమర్పించేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని నిర్దేశించారు. పొరుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆలయ ఆవరణలో ఎటువంటి అపశృతులు తలెత్తకుండా పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. వైద్య, పశు సంవర్ధక, అగ్నిమాపక, విద్యుత్ అధికారుల బృందాలు నిరంతరం తిరునాళ్లల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులను నిలుపుదల చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



హరిద్ర శృంగార్చన పూజలో పాల్గొన్న భక్తులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 46వ హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడారు. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శీఘ్రంగా వివాహం అయ్యేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

అలనాటి మధుర స్మృతులు.. గుర్తుకొచ్చాయి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టస్ సంస్థ అధినేత రామకృష్ణ

చెరుకుపల్లి: వివిధ రంగాల్లో స్థిరపడిన చిన్న నాటి మిత్రులు చదువులమ్మ ఒడికి చేరుకొన్నారు. ఎంతో సంతోషంతో ఒకరినొకరు పలుకరించుకొని కుశల ప్రశ్నలు వేసుకొన్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకోన్నారు. మండలంలోని కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. కళాశాలలో 1969 నుంచి 2023 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులంతా.. వందల సంఖ్యలో ఒకే వేదికపై ఒక్కటయ్యారు. ప్రాంగణంలో ఉన్న కళాశాల వ్యవస్థాపకులు తుమ్మల సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టస్ సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ, మహారాష్ట్ర మాజీ డీజీపీ దేవరపల్లి కనకరత్నం, గడ్డిపాటి వాసు, కిలారి మనోహర్, పిట్టు శ్రీనివాసరెడ్డి, రావూరి ఆంజనేయులు, బొనిగల విజయ్‌కుమార్, దివి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి నిధులివ్వకుండా బీజేపీ కుట్ర

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి

బాపట్ల అర్బన్: రాజధాని నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులు ఎగ్గొట్టేందుకు బీజేపీ గోడ మీద పిల్లిలా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర వర్గ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. కేంద్రం రాజధాని నిర్మాణానికి నిధులు ఎగ్గొట్టిందన్నారు. నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణానికి నిధుల అంశంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని కోరారు. కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. చమురు ట్యాంకర్‌లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఆదానీకి గ్రీన్ ఎనర్జీ పేరిట నిబంధనలు పాటించకుండా రాష్ట్రంలో విలువైన భూములను అప్పజెప్పడంపై మండి పడ్డారు. బాపట్ల పట్టణంలో మురుగు తొలగించేందుకు అవసరమైన కార్మికుల సంఖ్యను తగినంత పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, జిల్లా నాయకులు టి.కష్ణమోహన్, ఎస్.బాబురావు, సీహెచ్ మంజ్ దార్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి

బాపట్ల అర్బన్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పట్టణంలోని వెంగళవిహార్‌లో నివాసం ఉంటున్న చింతా సుదేవ్ కుటుంబాన్ని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారికి ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కర్లపాలెం కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మోపర్తి జాన్, జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అలపర్తి శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని వెంకటరెడ్డి చేతుల మీదుగా అందించారు. నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, పార్టీ నాయకులు గిరిజా రాణి, అజీమ్ ఖాన్, శ్రీనివాసరావు, వీరారెడ్డి, రవి రెడ్డి, రజినీకాంత్, కొప్పురి రత్నప్రసద్, బీరకాయల రెడ్డి, పాస్టర్ చంద్రకుమార్, మాజీ సర్పంచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపల్ సత్యబాబు హఠాన్మరణం



పాణుకుమాటి సత్యబాబు

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్, సమాజ సేవకుడు పాణుకుమాటి సత్యబాబు (62) హఠాన్మరణం చెందారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని స్వగృహంలో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటురాగా, కుటుంబ సభ్యులు గమనించి, ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందారు. తాలూకా జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఏడాదిన్నర క్రితం పదవీ విరమణ చేశారు. అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్‌గానే కాకుండా ఉచిత బ్రాహ్మణ వివాహ వేదిక సంస్థ కార్యదర్శిగా గత మూడున్నర దశాబ్దాలుగా బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఎన్నో వివాహాలకు కారకులయ్యారు. నాయుడమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకుడైన పట్టణ ప్రముఖుడు పి.విష్ణుమూర్తికి సోదరుడు సత్యబాబు. నాయుడమ్మ అవార్డును ప్రదానం చేసిన సభకు సత్యబాబు, ఆయన సోదరీమణులు ఎంతగానో తోడ్పాటునందించేవారు. కొన్నేళ్ల క్రితం విష్ణుమూర్తి మృతితో నాయుడమ్మ అవార్డు ప్రదానం నిలిచిపోయింది. ఇటీవలే సత్యబాబు, ఆయన సోదరిలు పూనుకుని, నాయుడమ్మ ట్రస్ట్‌ను చెన్నైలోని సీఎల్ఆర్ఐ సంస్థకు అప్పగించారు. లాంఛనంగా సభ నిర్వహణకు సన్నాహాల్లో ఉండగానే సత్యబాబు మృతిచెంది, అందరినీ విషాదంలో ముంచారు. నాయుడమ్మ ట్రస్ట్ సభ్యుడు సూరెడ్డి సూర్యమోహన్, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక అధ్యక్షుడు టి.దక్షిణామూర్తి, కోశాధికారి ఆర్.రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి పూర్ణభాస్కర్, వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య అధ్యక్షుడు అమ్మణి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి టి.సూరిబాబు నివాళులర్పించినవారిలో ఉన్నారు.